## క్లుప్తంగా

### 557 మందికి వైద్య పరీక్షలు

**జూపూడి(ఇబ్రహీంపట్నం):** ఎన్టీటీపీఎస్ ఆధ్వర్యంలో జూపూడిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని చీఫ్ ఇంజినీర్ టి.నాగరాజుతో కలిసి ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ శనివారం ప్రారంభించారు. 557 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లు, మందులు పంపిణీ చేశారు. డెప్యూటీ కార్యదర్శి సుశీల, ఎంపీడీవో సునీతశర్మ, ఎంపీపీ పాలడుగు జోత్స్న, వైస్ ఎంపీపీ నాగబాలమ్మ పాల్గొన్నారు.

### పీఏసీఎస్ కార్యాలయ ఉద్యోగుల నిరసన

**ఈలప్రోలు(ఇబ్రహీంపట్నం):** పీఏసీఎస్ కార్యాలయ ఉద్యోగులకు భద్రత కల్పించాలని ఏపీ పీఏసీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈలప్రోలులో నల్ల బ్యాడ్జీలు ధరించి శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈలప్రోలు పీఏసీఎస్ కార్యదర్శి పవన్ కుమార్‌పై స్థానికుడు బత్తుల శ్రావణ్‌కుమార్ చేసిన దాడిని తీవ్రంగా ఖండించారు. పీఏసీఎస్ జిల్లా ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహారావు, ఆలిండియా కోఆపరేటీవ్ బ్యాంక్స్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఉద్యోగులు, యూనియన్‌ల నేతలు పాల్గొన్నారు.

### ఆలయ నిర్మాణానికి విరాళాలు

**తిరువూరు:** స్థానిక జగన్నాథపురం కాలనీలోని పాటిమీద దాసాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి శనివారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. పుట్రేల మారెమ్మ అమ్మవారి ఆలయ అర్చకులు కొదమసింహం శ్రీమన్నారాయణాచార్యులు రూ.75 వేలు, తిరువూరుకు చెందిన కట్టమూడి నాగేశ్వరరావు రూ.25 వేలు, జవ్వాజి వెంకట రామారావు రూ.1.50 లక్షలు, జవ్వాజి రాము రూ.50,116, జవ్వాజి శ్రీనివాసరావు రూ.లక్ష, దోసపాటి కిశోర్ రూ.35,116, దారా హరి బాబు రూ.25,116 విరాళాలను ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త వెల్లంకి సురేంద్రబాబుకు అందజేశారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కొల్లిపర సుబ్బారావు, సంకా రాంబాబు, కూరపాటి గోపాల్, దేవాలయ ఇన్‌చార్జి నర్సింగ్ లక్ష్మణ్, ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ

**మైలవరం:** మైలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. పీఆర్‌టీయూ మైలవరం మండల అధ్యక్షులు కె.కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఆర్‌వీఎస్. రామకృష్ణారావు, ఎంఈఓ ఎల్. బాలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే ఉజ్వల భవిత

**మంత్రి కొలుసు పార్థసారథి**

**నూజివీడు:** విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. పట్టణంలోని మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని మంత్రి శనివారం ప్రారంభించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర వ్యాప్తంగా 475 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న 1,48,419 మంది ఇంటర్ విద్యార్థులకు శనివారం నుంచి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. డీవీఈఓ బి. ప్రభాకర్‌రావు, ప్రిన్సిపాల్ స్వర్ణలత, అధ్యాపక సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.



నూజివీడులో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి

● **మైలవరం:** మైలవరం వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ప్రారంభించి మాట్లాడారు. ఎంపీడీఓ అనూరాధ, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, సర్పంచ్ మంజుభార్గవి పాల్గొన్నారు.



మైలవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్

● **తోటమూల(గంపలగూడెం):** తోటమూలలోని గంపలగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ జి. అనురాధ, ఎంఈఓ పీవీడీఎల్ నరసింహారావు, మాజీ జెడ్పీటీసీ డీవీ కృష్ణారావు, ఉప సర్పంచ్ సైదులు పాల్గొన్నారు.

### వరి పొలాల పరిశీలన

**కోకిలంపాడు(తిరువూరురూరల్):** దాళ్వా వరి సాగులో వెదజల్లే పద్ధతి పాటించే రైతులు కలుపు యాజమాన్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ అన్నారు. కోకిలంపాడులో వరిపైర్లను శనివారం పరిశీలించిన ఆమె రైతులకు పలు సూచనలిచ్చారు. రైతులు పాల్గొన్నారు.

### అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ

**ఆగిరిపల్లి:** ఎయిడ్స్ నియంత్రణపై ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అవగాహన పెంచుకోవాలని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ జోనల్ సూపర్‌వైజర్ సుందరరావు అన్నారు. మండలంలోని తోటపల్లిలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ నివారణ సంస్థల ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ సంధ్య ప్రియ, ఎంఎల్‌హెచ్‌ఓ జోషి, ఏఎన్ఎం సునీత పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్

**ఆగిరిపల్లి:** ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ ఉద్దేశ్యమని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. శనివారం ఆయన స్థానిక పొన్నం కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ భార్గవి, అధికారులు పాల్గొన్నారు.

### లూయీ బ్రెయిలీకి ఘన నివాళి

**ఆగిరిపల్లి:** లూయీ బ్రెయిలీ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. తోటపల్లి హీల్ పాఠశాలలో ఆయన చిత్రపటానికి ప్రధానోపాధ్యాయుడు సాయిబాబు నివాళులర్పించారు. ఆగిరిపల్లిలోని భవిత పాఠశాలలో ఎంఈఓలు సర్వేశ్వరరావు, ఆనంద్‌కుమార్ పాల్గొని అంధుల కోసం లూయీ బ్రెయిలీ చేసిన సేవలను వివరించారు. హెచ్ఎం విజయదుర్గ, ఉపాధ్యాయిని ఝాన్సీరాణి పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

### హెల్మెట్ వాడకంపై ప్రత్యేక డ్రైవ్

**మైలవరం:** వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని మైలవరం సీఐ దాడి చంద్రశేఖర్ అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వద్ద వై. జంక్షన్‌లో శనివారం హెల్మెట్ వాడకంపై పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. వాహన చోదకులు హెల్మెట్ ధరించడం వలన కలిగే ప్రయోజనాలను సీఐ చంద్రశేఖర్ వివరించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఎస్ఐ కె. సుధాకర్, ఏఎస్ఐ సర్వేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

### అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలని ధర్నా

**నూజివీడు:** నూజివీడు డిపోలో పనిచేస్తున్న డ్రైవర్ దానుపై అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేసి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని వీడీటీ ఎంప్లాయీస్ యూనియన్ రీజియన్ కార్యదర్శి బి.రాంబాబు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ డిపో గేట్ వద్ద ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం కార్మికులు ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రైవర్, కండక్టర్ల తప్పు లేకపోయినా వారిని బాధ్యులను చేస్తూ శిక్షించడం సరికాదన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ డిపో అధ్యక్షుడు ఎం. చిరంజీవి, కోశాధికారి పి. శ్రీనివాసరావు, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రచార కార్యదర్శి పి. కృష్ణప్రసాద్, ఏఐటీయూసీ నాయకులు చాట్ల పుల్లారావు, వి. నారాయణరావు, వై. రమేష్, పేరయ్య, ఎండీఎం అలీ, మురళీధర్ పాల్గొన్నారు.

### వ్యవసాయాధికారి మధుమోహన్‌కు సన్మానం

**ముసునూరు:** ప్రతి ఉద్యోగికి బదిలీ ఓ మజిలీ అని, ఎక్కడైనా సమర్థవంతంగా పనిచేసి, రైతులకు మేలు చేయడమే తమ ఉద్యోగ ధర్మమని వ్యవసాయశాఖ నూజివీడు ఏడీ విద్యాసాగర్ అన్నారు. ముసునూరు మండల వ్యవసాయాధికారిగా పనిచేసిన సందిపాము మధుమోహన్ శనివారం మండలం నుంచి రిలీవ్ అయ్యారు. ఆయన విజయవాడలోని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్యాలయ సిబ్బంది, పలువురు రైతులు ఆయనను ఘనంగా సన్మానించారు. నూజివీడు ఏడీఏ కార్యాలయంలో పనిచేస్తున్న చిననూరిబాబు ముసునూరులో ఏఓగా బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో చాట్రాయి ఏఓ శివశంకర్, రైతులు చిలుకూరి రామ్మోహన్‌రావు, తుమ్మల సురేంద్ర పాల్గొన్నారు.

### అక్రమ వెంచర్‌పై ఫిర్యాదు

**జి.కొండూరు:** తెల్లదేవరపాడు గ్రామ పరిధిలో అనుమతులు లేకుండా అక్రమంగా ఏర్పాటు చేస్తున్న వెంచర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామంలో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో సర్పంచ్ ఉమ్మడి ప్రసాద్ తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని సర్వే నంబరు 86తోపాటు దాని సబ్ డివిజన్లలోని భూమిలో గ్రామ పంచాయతీకి కామన్ సైట్ కేటాయించకుండా, అనుమతులు లేకుండా రాత్రి సమయాల్లో మట్టిని తరలించి రోడ్లను నిర్మిస్తూ వెంచర్ ఏర్పాటు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి గ్రామ పంచాయతీకి చెందవలసిన కామన్‌సైట్‌ను ఇప్పించాలని సర్పంచ్ ప్రసాద్ తహసీల్దార్‌ను కోరారు.

### ఈ క్రాప్, ఈకేవైసీ చేయించండి

**తిరువూరురూరల్:** రబీ సీజన్‌లో సాగుచేసే పంటల వివరాలను రైతులు ఈ పంటలో నమోదు చేయించుకోవాలని తిరువూరు మండల వ్యవసాయాధికారి పి. పద్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరి, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేసే రైతులు ఈ పంట నమోదుతో పాటు ఈకేవైసీ చేయించుకోవాలని చెప్పారు. రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది నమోదు చేస్తారన్నారు.

## మేకా ప్రతాప్‌ను కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు

**నూజివీడు:** వైఎస్సార్ సీపీ పటిష్టానికి నూతనంగా జిల్లా కమిటీలో నియమితులైన నాయకులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు అన్నారు. ఇటీవల వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీలో నియమితులైన పలగాని నరసింహారావు, మాదాల నరసింహారావు, బసవా వినయ్, కంచర్ల లవకుమార్, మచ్చా హరిబాబు, తొర్లపాటి శ్రీనివాసరావు, పెదగర్ల స్వరూపరాణి శనివారం మేకా ప్రతాప్ అప్పారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ పార్టీ పటిష్టానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పదవులు పొందిన వారందరూ ప్రతాప్ అప్పారావుకు కృతజ్ఞతలు తెలిపారు.



మేకా ప్రతాప్ అప్పారావుతో నాయకులు

## బాలికా విద్యను ప్రోత్సహించాలి

**ఐసీడీఎస్ తిరువూరు సీడీపీఓ సత్యవతి**

**తిరువూరు:** వయసుతో పాటు శరీరంలో వచ్చే మార్పులపై అవగాహన కల్పించుకుని తాత్కాలిక ఆకర్షణలకు లోనుకాకుండా బాలికలు చదువుపై దృష్టి సారించాలని ఐసీడీఎస్ తిరువూరు ప్రాజెక్టు అధికారి సత్యవతి అన్నారు. తిరువూరు శ్రీనిధి స్కూల్‌లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం ఉదయం సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాలికా విద్యపై తల్లిదండ్రులు సైతం చిన్నచూపు చూడవద్దని, మగపిల్లలతో సమానంగా చదివించాలని సూచించారు. జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు గంగాధర్, ఉషారాణి, రాంప్రదీప్, సుదర్శన్, సుబానీ, శ్రీనిధి స్కూల్ కరస్పాండెంట్ కిశోర్‌బాబు, ప్రిన్సిపాల్ వెంకటనారాయణ పాల్గొన్నారు.

### బాలికా విద్య ఇంటికి వెలుగు

**విస్సన్నపేట:** బాలికలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని విస్సన్నపేట ఎంపీడీఓ రాట్నాలు అన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విస్సన్నపేట వెలుగు కార్యాలయంలో శనివారం నిర్వహించిన కిశోరి వికాసం కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఆడపిల్లల చదువు ఇంటికి వెలుగన్నారు. ఆడపిల్లలను అవకాశమున్నంత వరకు చదువుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. తిరువూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి సత్యవతి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో బాలికా సంఘాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎంఈఓ సుధాకర్, వెలుగు ఏపీఎం జమలయ్య, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సత్యవతి

## 3,200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

**విస్సన్నపేట:** ఎక్సైజ్ అధికారులు శనివారం విస్సన్నపేట మండలంలో విస్తృత దాడులు నిర్వహించారు. నూతిపాడు వద్ద సారా తయారీకి సిద్ధం చేసిన 1,350 లీటర్ల బెల్లపు ఊట, తాతకుంట్ల అమ్మ చెరువు వద్ద వెయ్యి లీటర్ల బెల్లపు ఊట, చంద్రుపట్ల తండాలో 700 లీటర్లు, ఎ.కొండూరు మండలం కుమ్మరికుంట్ల తండాలో 150 లీటర్ల బెల్లపు ఊట, మొత్తం 3,200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.

### సారా నిషేధంపై సదస్సు

సారా నిషేధంపై చంద్రుపట్ల గ్రామస్తులకు ఎక్సైజ్ అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలో సారా నిర్మూలనకు సహకరిస్తామని, యువకులు కమిటీగా ఏర్పడి సారాకు సంబంధించిన సమాచారాన్ని తెలియజేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఎక్సైజ్ డెప్యూటీ కమిషనర్ టి. శ్రీనివాసరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్. శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్ శివ, తిరువూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జె. శ్రీనివాస్, భవానీపురం, విజయవాడ ఈస్ట్, వెస్ట్ ఎక్సైజ్ స్టేషన్ల అధికారులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సుకు 22 అర్జీలు

**కె.తాడేపల్లి(విజయవాడరూరల్):** నిషేధిత భూముల జాబితా నుంచి మా భూములను తొలగించాలని కోరుతూ కొత్తూరు తాడేపల్లి గ్రామానికి చెందిన పలువురు గ్రామ రెవెన్యూ సదస్సులో వినతిపత్రాలు అందజేశారు. గ్రామ రెవెన్యూ సదస్సు కె.తాడేపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం జరిగింది. 22 మంది వివిధ సమస్యలపై అర్జీలను అందజేశారు. తహసీల్దారు బి.సుగుణ, ఆర్ఐ రాజేష్, వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.



# అభివృద్ధిపథంలో విస్సన్నపేట

**విస్సన్నపేట:** మూడు జిల్లాల కూడలిలో ఉన్న విస్సన్నపేట పట్టణం అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది. గతంలో వ్యవసాయానికే పరిమితమైన ఈ ప్రాంతంలో కార్పొరేట్ స్థాయి విద్యాసంస్థలు, మల్టీ కాంప్లెక్స్ షాపింగ్ మాల్స్ ఏర్పాటుతో పట్టణ రూపు రేఖలు మారిపోతున్నాయి. సుమారు 30 గ్రామాలకు కూడలిగా ఉన్న విస్సన్నపేటకు రవాణా సదుపాయం కూడా అభివృద్ధి చెందడంతో ప్రజల రాకపోకలకు అనువుగా ఉంది. కేజీ నుంచి పీజీ వరకు అన్ని తరగతులకూ విద్యాసంస్థలు అందుబాటులో ఉండటంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఇక్కడికి వచ్చి తమ పిల్లలను చదివించుకుంటున్నారు. గతంలో ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ ఉపకరణాలు, దుస్తులు కావాలంటే నూజివీడు లేదా విజయవాడ వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు అన్నీ ఇక్కడే సరసమైన ధరకు లభ్యమవుతున్నాయి. ఆకృతి, రాయల్, ట్రెండ్స్, గీతా షోరూంలు విభిన్న మోడల్స్ దుస్తులను అందుబాటులోకి తీసుకువచ్చాయి.

### వైద్యరంగంలోనూ అభివృద్ధి ..

ప్రైవేటు ఆస్పత్రుల రంగప్రవేశంతో విస్సన్నపేట వాసులకు మెరుగైన వైద్యసేవలందుతున్నాయి. జనరల్ మెడిసిన్‌తో పాటు ఆర్థోపెడిక్, కార్డియాక్, ఈఎన్‌టీ, పీడియాట్రీషియన్ల సేవలు అందుబాటులో ఉన్నాయి. స్వచ్ఛంద సంస్థలు, సేవా సంస్థలు ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్యశిబిరాలు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయి.

### శుభకార్యాలకూ చక్కని వేదికలు

వివాహాది శుభకార్యాలు చేసుకునేందుకు ఆధునిక వసతులతో కల్యాణ మండపాలు సిద్ధమయ్యాయి. గతానికి భిన్నంగా యువత కోరుకునే రీతిలో ఏసీ సదుపాయం, ఆధునిక సీటింగ్, వంటశాలలు, ఫంక్షన్ హాల్స్‌తో కల్యాణ మండపాలు సినిమా సెట్టింగులతో కళకళ లాడుతున్నాయి.



విస్సన్నపేట కూడలి ప్రాంతం



విస్సన్నపేటలోని వికాస్ విద్యాసంస్థలు




విస్సన్నపేటలోని వస్త్ర దుకాణం



విస్సన్నపేట శ్రీశ్రీ విద్యా సంస్థలు



విస్సన్నపేటలోని సూపర్‌బజార్

### నోరూరించే మామిడి...



మామిడి పంటకు ప్రసిద్ధి చెందిన విస్సన్నపేటలో ఇప్పటికీ పలు ప్రాంతాల నుంచి వచ్చే వ్యాపారులు, కమీషన్ వ్యాపారులతో వేసవి సీజన్ సందడిగా ఉంటోంది. ఇక్కడి నుంచి దేశవిదేశాలకు మామిడి ఎగుమతులతో పాటు మామిడి తాండ్ర, ఊరగాయ నిల్వ పచ్చళ్లను తయారు చేసి ఎగుమతి చేయడం ద్వారా పలు కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి.